క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తా..



చొక్కాకుల వెంకటరావును సత్కరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడిగా నియమితుడైన చొక్కాకుల వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం చొక్కాకులను కె.కె.రాజు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



ఆశ్రిత, పృథ్వీరాజ్‌లను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: ఇటీవల ఉత్తరప్రదేశ్ మీరట్‌లోని స్వామి వివేకానంద శుభార్తీ యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ మహిళలు, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలో బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న బి.ఆశ్రిత 50 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి కె.పృథ్వీరాజ్ 63 కిలోల విభాగంలో తలపడి కాంస్య పతకం గెలుపొందాడు. ఈ సందర్భంగా శుక్రవారం విజేతలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, వ్యాయామ విభాగాధిపతులు పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం


రమ


ఫాల్గుణ్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం కప్పరాడలో నివసిస్తున్న మూల ధర్మారావుకు భార్య రమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఫాల్గుణ్ పుట్టిన రోజు కోసం దుస్తులు కొనడానికి భర్త దగ్గర రూ.1,000 తీసుకుని చిన్న కుమారుడితో కలిసి ఈ నెల 20న భార్య రమ బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భర్త ధర్మారావు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వారి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటలకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

‘ఉత్తర’లో బలప్రదర్శన...!

- పొత్తు ఒరలో ఒదగలేకపోతున్న గ్లాసు, కమలం
- విష్ణుకుమార్‌రాజు కంటే బలమైన అభ్యర్థిని తానే అంటున్న ఉషాకిరణ్
- 2019 ఎన్నికల్లో బీజేపీ కంటే జనసేనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని లెక్కలు
- ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించే వరకూ విశ్రమించనంటున్న నార్త్ ఇన్‌చార్జి



పార్టీ నాయకులతో ఇటీవల సమావేశమైన జనసేన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కంటే తానే బలమైన అభ్యర్థినని జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ చెప్పుకుంటున్నారు. జనసేనకు ఉత్తర స్థానాన్ని కేటాయిస్తే గెలుపు కానుకగా ఇస్తామని సీటు దక్కించుకోవడానికి ఆమె పావులు కదుపుతున్నారు. ఇటీవల జరిగిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో గత ఎన్నికల ఫలితాలను చూపిస్తూ.. బీజేపీ కంటే జనసేనకే ఎక్కువ ఓట్లు పోలయ్యాయని, దానికి తోడు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న కాపు సామాజిక వర్గం ఓట్లు, మెగా ఫ్యాన్స్, యూత్ ఓట్లతో జనసేన సునాయాసంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఉత్తర సీటు జనసేనకు కేటాయించేలా పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను ఒప్పించేలా ప్రయత్నాలను మరోసారి ఉషాకిరణ్ ముమ్మరం చేశారు.

పొత్తులో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడిగా ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును బీజేపీకి కేటాయించింది. ఈ సీటు ఎవరికి కేటాయించిందో బీజేపీ అధిష్టానం ఇప్పటి వరకు వెల్లడించలేదు. అయితే విష్ణుకుమార్‌రాజు మాత్రం తానే ఉమ్మడి అభ్యర్థినని మూడు నెలలుగా వ్యక్తిగత ప్రచారం చేస్తూ, కొద్ది రోజులుగా వార్డుల్లో పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలతో ప్రచారం మొదలెట్టేశారు. పొత్తు ధర్మం ప్రకారం టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ గెలుపునకు సహకరించాల్సి ఉండగా.. జనసేన నార్త్ ఇన్‌చార్జి ఉషాకిరణ్ మాత్రం తానే బలమైన అభ్యర్థినని, తనకే సీటు కేటాయించాలని ఆ పార్టీ అధిష్టానానికి బలంగా మెసేజ్ పంపించడంతో నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల్లో పెద్ద చర్చకు తెరలేపినట్టయింది.

బీజేపీకి పట్టేది..?

ఉత్తరలో తన బలమేమిటో 2019 ఎన్నికలే రుజువని, టీడీపీ, వైఎస్సార్‌సీపీ తర్వాత మూడో స్థానంలో జనసేన నిలిచిందని ఉషాకిరణ్ చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కంటే తనకే ఎక్కువ ఓట్లు పోలయ్యాయని, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన తైనాల విజయ్‌కుమార్ కంటే ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి షిరీన్ రెహ్మాన్ కేవలం 2 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని, 2014 ఎన్నికల్లో సైతం పొత్తులో భాగంగానే టీడీపీ, జనసేన మద్దతుతో గెలిచిందే తప్ప.. బీజేపీకి పట్టులేదని, ఇందుకు ఎన్నికల ఫలితాలే రుజువని అంటున్నారు.

నియోజకవర్గంలో 80 వేల ఓట్లు ఉన్న కాపు సామాజికవర్గం మెగా ఫ్యాన్స్, ప్రతి ఇంట్లో ఉన్న యువత అభ్యర్థి గెలుపును ప్రభావితం చేస్తాయని, ఇదంతా జనసేనకు బలం చేకూర్చే విషయమని ఉషాకిరణ్ పార్టీకి లేఖ ద్వారా మరోసారి స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. గత నాలుగేళ్లలో విష్ణుకుమార్‌రాజు ప్రజల మధ్య లేరని, విశాఖ అర్బన్‌లో ఒక్క సీటు కూడా జనసేన కాపులకు కేటాయించలేదని, ఈ నేపథ్యంలో ఉత్తర సీటు కోసం అధిష్టానాన్ని ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదే జరిగితే ఉత్తర సీటు నాదే అంటూ ప్రచారం ప్రారంభించిన విష్ణుకుమార్‌రాజు పరిస్థితి ఏంటని జనం గుసగుసలాడుతున్నారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

వైఎస్సార్‌సీపీ ‘ఉత్తర’ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



మహిళా వాకర్స్‌కు అభివాదం చేస్తున్న కె.కె.రాజు. చిత్రంలో అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: ఒక్క అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 49, 50 వార్డుల పరిధిలోని మురళీనగర్ వాకర్స్ పార్కు, సుదర్శన్ పార్కు, ప్రశాంతి పార్కులను శుక్రవారం ఉదయం ఆయన స్థానిక కార్పొరేటర్లు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని స్థానికులను కోరారు. పార్కుకు వచ్చిన వాకర్స్‌తో కాసేపు ముచ్చటించారు. వాకర్స్ అంతా మద్దతు అందిస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. బగాతి విజయ్‌కుమార్, పైడి కృష్ణారావు మాస్టరు, అమర్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి కె.కె.రాజు పర్యటించారు.

చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ



రాత్రి గస్తీలో ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు, యువకులు

సీతమ్మధార: నగరంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి గస్తీ పెంచారు. స్థానిక యువకుల సహాయంతో దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టారు. క్రైం సిబ్బందితోపాటు యువకులు రాత్రి పూట అన్ని ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ ఎటువంటి చోరీలు జరగకుండా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ నేరాలు, దొంగతనాల నియంత్రణకు సిబ్బందితోపాటు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉన్న యువకులతో కలిసి రాత్రి గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే..

సీతమ్మధార: పోలింగ్ బూత్‌లకు 200 మీటర్ల దూరంలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవాలని, అంతకంటే ముందు ఏర్పాటు చేస్తే అనుమతి ఉండదని ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పార్టీ ఆఫీస్‌లో మూడు జెండాలు, ఒక బ్యానర్ మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాలను, నిబంధనను ప్రతి ఒక్క పార్టీ నాయకుడు తప్పక పాటించాలని సూచించారు. ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చెప్పారు.

ఇఫ్తార్ విందులో కె.కె.రాజు



ముస్లింలతో కలిసి విందులో పాల్గొన్న కె.కె.రాజు, నాయకులు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ పార్కు వద్ద కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో స్థానిక ముస్లింలు శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొన్నారు. ముస్లింలు వివిధ రకాల ఆహార పదార్థాలను వారి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. రంజాన్ ఉపవాస దీక్షలు పురస్కరించుకుని ముస్లింలతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందని కె.కె.రాజు అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సహకారం అందించాలని వారిని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రెహమాన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ బాబ్జి, విశాఖ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కె.వి.బాబా, వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

‘ఏవీఎన్’లో ఎన్‌సీసీ 13(ఏ) బెటాలియన్ కార్యాలయం



లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

డాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ నూతన కార్యాలయం శుక్రవారం ప్రారంభమైంది. 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ పాల్గొని, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాడెట్లు మరింత క్రమశిక్షణతో మెలగాలని, కళాశాలకు, ఎన్‌సీసీ విభాగానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ క్యాడెట్లు మరిన్ని క్యాంపుల్లో పాల్గొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. నూతన కార్యాలయాన్ని ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఏజీబీ శంకర్ నేతృత్వంలో క్యాడెట్లు చక్కగా ఆధునీకరించడంపై అభినందించారు. నీరజ్‌కుమార్ కళాశాలలోని జువాలజీ మ్యూజియం, ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం, పలు విభాగాలను సందర్శించి, కళాశాలకు అవసరమైన సహాయాన్ని ఎన్‌సీసీ తరపున చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, ఇతర కళాశాలల ఎన్‌సీసీ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో వాటర్ ఫౌంటెయిన్



మహారాణి పార్లర్ కూడలిలో కాంతులీనుతున్న వాటర్ ఫౌంటెయిన్

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ విద్యుత్ దీపాల వెలుగులో ఆకట్టుకుంటోంది. సుమారు రూ.96 లక్షలతో మహారాణి పార్లర్ జంక్షన్‌ను అందంగా తీర్చిదిద్దారు. కూడలి నాలుగు వైపులా కోబుల్ స్టోన్ టేబుల్ టాప్స్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్, సెంటర్ ఐలాండ్, వాటర్ ఫౌంటెయిన్, విద్యుత్ దీపాలు అమర్చారు. కొద్ది రోజుల కిందట ఫౌంటెయిన్‌కు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళ చూడముచ్చటగా కనిపిస్తోంది.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ దివ్యగౌతమీ

కంచరపాలెం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 47వ వార్డు కప్పరాడ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ‘క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం’ అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ దివ్యగౌతమీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ముందుగా ర్యాలీ నిర్వహించి రాంజీ ఎస్టేట్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దొరబాబు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్‌ఎస్ శరత్, టీబీ హెచ్‌వీ ఎస్.పైడిరాజు, హెచ్‌వీ భారతి, టీబీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులతో మానసిక వికాసం



అతిథులతో సదస్సు కన్వీనర్లు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ×మనస్తత్వశాస్త్రం – వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలు×పై శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సుకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. సదస్సుకు అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆంధ్ర వైద్య కళాశాల సైకియాట్రిస్ట్, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కె.రామిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సమాజంలో జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించినపుడే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. ఆచార్య డాక్టర్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ మానసిక వికాసానికి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. సెయింట్ జోసెఫ్ సేవా కార్యక్రమాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు అందిస్తున్న చేయూత ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్యోతి, ఆర్.పావని, డాక్టర్ రూపా సెల్వరాజ్, డాక్టర్ జాన్‌పాల్ రాజ్, డాక్టర్ విజయ శ్రీనివాస్, పి.వీరభద్రస్వామి, హేమ, రజిని, హదసా, పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, పీఆర్‌వో, హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అలాగే కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని చెప్పారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

‘వీరుల త్యాగం.. వృథా కానివ్వం’



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: ‘విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు’ నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను సైతం ధారపోశారన్నారు. ఎంతోమంది భూములను ధారాదత్తం చేశారన్నారు. నాటి త్యాగధనుల స్ఫూర్తితో, చెదరని సంకల్పంతో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సౌమ్య వేధింపులపై ఫిర్యాదు

సీతమ్మధార: కొద్ది రోజుల కిందట తన ఇంట్లో దొంగతనం చేసి దొరికిపోయిన కిల్లంపల్లి సౌమ్య.. తన కుమార్తెను సోషల్ మీడియా ద్వారా వేధిస్తోందని రిటైర్డ్ తపాలా శాఖ అధికారి జనపాల ప్రసాద్‌బాబు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిల్లంపల్లి సౌమ్య అనే మహిళ ఇన్‌స్టాగ్రాం పేరుతో తమ కుమార్తె మోనికదివ్యతో స్నేహం పెంచుకొని ఇంటికి వచ్చి నాలుగు దఫాలుగా 75 తులాల బంగారు నగలు చోరీ చేయడంతో క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. నేరం రుజువు కావడంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి కొంత మేరకు బంగారు నగలు అందజేశారని చెప్పారు. బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగతంగా మానసిక వేదనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్‌గా, కుటుంబం మొత్తం మానసిక క్షోభను అనుభవిస్తున్నట్లు ప్రసాద్‌బాబు తెలిపారు. సౌమ్యపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు.

వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఊంజల్ సేవలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజావరోహణం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పుష్పయాగం, ఊంజల్ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

దేశ భవితను మార్చే శక్తి యువత సొంతం

ఏయూ క్యాంపస్: దేశ భవితను మార్చే శక్తి యువతకు ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత వాస్తవిక సమాజం విసిరే సవాళ్లకు సిద్ధం కావాలని సూచించారు. మార్కులు, ర్యాంకులు ప్రధానమేనని, అదే సమయంలో సమాజంతో సమన్వయం చేసుకుంటూ పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలలో ప్రతిభచూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



విద్యార్థికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

రైల్వే స్టేషన్‌లో 16 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడితో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్‌ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వి.బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫరీద్‌షా తమ తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బిహార్‌కు చెందిన గణేష్‌కుమార్ బ్యాగులను తనిఖీ చేయగా.. అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.80 వేల విలువైన 16 కేజీల గంజాయిని గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు.